ఊపిరి పీల్చుకో..

నమ్మివానిపేట

నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి వెలువడే దుర్గంధం, పొగతో ఉక్కిరిబిక్కిరైన 25 గ్రామాలు నిశ్చింతగా ఊపిరి పీల్చుకోనున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణం పూర్తయి ట్రయల్ రన్ కూడా పూర్తి కావడంతో త్వరలో దీనిని ప్రారంభించనున్నారు. క్లాప్ వాహనాల ద్వారా ఎప్పటికప్పుడు చెత్త తరలింపుతో పాటు విదేశీ పరిజ్ఞానంతో తయారైన బయోమైనింగ్ యంత్రాన్ని అందుబాటులో ఉంచడంతో గ్రేడింగ్ సులభతరం కానుంది.

- డంపింగ్‌యార్డులో ఆధునిక వసతులు
- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- 25 గ్రామాలకు దుర్గంధం, పొగ నుంచి విముక్తి



దంపింగ్‌యార్డులో నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్



స్టేషన్ ముందు ప్లాట్‌ఫాం, పచ్చదనం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డు స్వరూపమే మారిపోయింది. గతంలో వేల టన్నుల చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో చుట్టుపక్కల గ్రామాలకు దుర్గంధం వ్యాపించేది. ఎప్పుడు పడితే అప్పుడు ఎండలకు చెత్త మధ్యలో వెలువడే వాయువుల కారణంగా మంటలు రేగి పొగ కమ్ముకునేది. ఈ పొగ డంపింగ్‌యార్డు చుట్టూ 10 కిలోమీటర్ల మేర 25 గ్రామాల ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసేది. అక్కడితో ఆగకుండా శ్వాసకోశ ఇబ్బందులు, కళ్ల మంటలతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డులో ఆధునిక వసతులు సమకూరడంతో పాటు పండ్ల, పువ్వుల తోటలను, కూరగాయలను ఇక్కడ సాగు చేస్తున్నారు.

జిందాల్ ప్లాంట్‌కు చెత్త తరలింపు

9 ఎకరాల నమ్మివానిపేట డంపింగ్‌యార్డుకు ప్రతిరోజూ జోన్‌లోని నాలుగు వార్డుల నుంచి 21 క్లాప్ (క్లీన్ ఏపీ) వాహనాలు, రెండు ట్రాక్టర్లు, అయిదు మినీ లారీల ద్వారా 35 టన్నుల చెత్త చేరుతుంది. క్లాప్ పథకంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.47 కోట్లతో క్లాప్ వాహనాలు సమకూర్చింది. అలాగే రూ.40 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను నిర్మించారు. ట్రయల్‌రన్ కూడా పూర్తవడంతో త్వరలో దీనిని ప్రారంభించనున్నారు. దీని ద్వారా క్లోజ్డ్ కంపాక్ట్ వాహనాల ద్వారా చెత్తను కాపులుప్పాడ తరలించే అవకాశం ఉంది. దీంతో డంపింగ్‌యార్డులో చెత్త వాసనే ఉండదు. ప్రస్తుతం రోజుకు 30 టన్నుల చెత్తను టిప్పర్ ద్వారా కాపులుప్పాడలోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు ఇక్కడ పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు రెండేళ్ల క్రితం ఏడు వాహనాలను వినియోగించడంతో ఇక్కడ చెత్తగుట్టలు కరిగిపోయాయి. ప్రస్తుతం యార్డులో 11వేల టన్నుల చెత్త నిల్వలు ఉన్నట్టు అంచనా. గత ప్రభుత్వ హయాంలోనే రూ.14 లక్షలతో ప్రహరీ ఎత్తుతో పాటు రెండు చోట్ల గేట్లు ఏర్పాటు చేశారు.



బయో మైనింగ్ ద్వారా వేరు చేసిన సారవంతమైన మట్టి



డంపింగ్‌యార్డులో బయో మైనింగ్‌కు వినియోగించే యంత్రం

బయోమైనింగ్ యంత్రం ఏర్పాటు

డంపింగ్ యార్డులో పూర్తి విదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన బయోమైనింగ్ యంత్రాన్ని అందుబాటులో ఉంచారు. డంపింగ్‌యార్డుకు వచ్చే చెత్తను ఈ యంత్రం ద్వారా గ్రేడింగ్ చేయవచ్చు. పాలిథిన్, ప్లాస్టింగ్ తప్పించి చెత్త నుంచి మట్టి, గ్రావెల్, ఇనుము, గాజులను వేరు చేస్తుంది. ఈ ప్రాసెస్ ద్వారా వేరు చేయబడిన మట్టి వ్యవసాయానికి సారవంతమైనది. అలాగే చిన్నముక్కలుగా వేరు చేయబడిన వ్యర్థాలతో ఎక్కడైనా గోతులు పూడ్చడానికి దోహదపడుతుంది. వేరు చేయబడిన వాటికి ధర నిర్ణయించి విక్రయించచ్చు. అయిదేళ్లలో పూర్తి కాలుష్యరహిత డంపింగ్‌యార్డుగా రూపాంతరం చెందడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్పోర్ట్స్ ర్యాంకింగ్‌లో కేథరిన్‌కు రెండో స్థానం



కేథరిన్ స్పోర్ట్స్ హెచ్‌వోడీ అనిల్‌కుమార్‌కు క్రీడా ప్రతిభ అవార్డు అందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తగరపువలస: జిల్లా స్థాయి క్రీడల ర్యాంకింగ్‌లో భీమిలి కేథరిన్ స్కూల్‌కు 161 పాయింట్లతో రెండో స్థానం లభించింది. 2023–24 విద్యాసంవత్సరానికి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన జిల్లాలోని ఐదు పాఠశాలలను ఎంపిక చేశారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా గురువారం ఏయూలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా పాఠశాల ప్రతినిధులకు అవార్డు కింద సర్టిఫికెట్, మొమెంటో అందించారు. మొదటి స్థానంలో కణితి జెడ్పీ హైస్కూల్‌కు 180 పాయింట్లు, 3వ స్థానంలో ఆనందపురం మండలం రామవరం జెడ్పీ హైస్కూల్‌కు 100, 4వ స్థానంలో భీమిలి సన్ స్కూల్‌కు 96, 5వ స్థానంలో మధురవాడ గ్లోబ్ స్కూల్ 74 పాయింట్లు లభించాయి. ఈ సందర్భంగా కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయ్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఫుట్‌బాల్, కరాటే, బేస్‌బాల్, నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, రగ్బీ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, స్పోర్ట్స్ హెచ్‌వోడీ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ సౌజన్య, పీఈటీలు బాలు, రాజు ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

క్లుప్తంగా

దివీస్ వితరణ

పాఠశాలకు రూ.2.25 లక్షల సాఫ్ట్‌బాల్ క్రీడా పరికరాల అందజేత



విద్యార్థులకు క్రీడాపరికరాలు అందిస్తున్న దివీస్ అధికారులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం గురువారం తూడెం జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు రూ.2.25 లక్షల విలువైన సాఫ్ట్‌బాల్ క్రీడాపరికరాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ చేతుల మీదుగా దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్ వీటిని అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మెరుగైన అవకాశాలు వెదుక్కుంటూ వస్తాయన్నారు. కార్యక్రమంలో పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు మొక్కుల చెల్లింపు



లక్ష్మీపురంలో ముత్యాలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న గూడెం కళ్లాల ప్రజలు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మిపురం పంచాయతీ గూడెం కళ్లాల వారు గురువారం ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. పశువులకు వ్యాధులు రాకుండా, రైతులు పాడి పంటలతో సిరి సంపదలతో ఉండాలని కోరుకుంటూ ఈ మొక్కులు చెల్లించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తామని వారు తెలిపారు.

గణపతి ఉత్సవాలకు పందిరి రాట



రాట ఉత్సవంలో పాల్గొన్న చిల్లపేటవాసులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు చిల్లపేటలో సిగడాం మహలక్ష్మి ఆలయ ఆవరణలో గణపతి ఉత్సవాలకు గురువారం రాట వేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

మధురవాడ: భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు మధురవాడ ప్రాంతంలో 12వేలు దాటి చేయించాలని విశాఖ పార్లమెంటరీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య చెప్పారు. మధురవాడలో వచ్చే నెల 2 నుంచి నిర్వహించనున్న సభ్యత్వ నమోదుపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీ, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామానాయుడు, నాగరాజు, వివిధ విభాగాలు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం



మృతుడు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ ముద్దాడపేట జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వృద్ధుడు దుర్మరణం చెందాడు. జొన్నాడ టోల్‌ప్లాజా దాటిన తరువాత విజయనగరం నుంచి తగరపువలస వైపు వస్తున్న వాహనం ఢీ కొట్టినట్టు భీమిలి పోలీసులు గుర్తించారు. మృతుని వివరాలు తెలిస్తే భీమిలి సీఐను 94409 04712, ఎస్ఐను 91826 94835 నంబర్‌లో సంప్రదించాలని స్టేషన్ సిబ్బంది సూచించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్



ఎన్ఎస్ఆర్ఐటీ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పర్వతారోహకుడు అన్మిష్‌వర్మ

తగరపువలస: జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక శ్రీబాసర విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రెండు రోజుల పాటు క్రికెట్, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. అనంతరం విజేతలకు విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సురేష్, భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో కేశవ, అధ్యాపకులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 28 వరకు క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. ఈ ఈవెంట్లలో 78 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు గురువారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్, అంతర్జాతీయ పర్వతారోహకుడు అన్మిష్ వర్మ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

భీమునిపట్నం: ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ ఆదర్శప్రాయుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విష్ణుమూర్తి అన్నారు. కళాశాలలో నిర్వహించిన ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్ క్రీడల్లో హాకీలో వరుసగా మూడు సార్లు బంగారు పతకాలను సాధించారన్నారు. విద్యార్థులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో రాములోరి ధనుస్సు



స్వామి వారి చెంత ధనుస్సు ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు



అయోధ్య రామాలయానికి సమర్పించనున్న ధనుస్సు

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయోధ్యలోని రామాలయానికి సమర్పించనున్న ధనుస్సు (కోదండం)కు అర్చకులు పూజలు చేశారు. అయోధ్యలోని సీతారామా ఫౌండేషన్ దీన్ని రూపొందించగా, అయోధ్య రామాలయానికి జనవరిలో సమర్పించనున్నారు. ఈలోగా దేశంలోని ముఖ్యమైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు. అందులో భాగంగా ఫౌండేషన్ సభ్యులు చల్లా శ్రీనివాస శాస్త్రి, వేదుల శ్రీనివాస రావు, సుచరిత తదితరులు ఈ ధనుస్సును తీసుకు వచ్చారు, కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్‌ను సందర్శించిన అధికారులు



హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం సందర్శించే అవకాశం ఉన్నందున పలువురు విద్యాశాఖ అధికారులు గురువారం పాఠశాలను సందర్శించారు. మంత్రి వస్తే సన్నద్ధత, అందించాల్సిన వివరాలు, చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై ఉపాధ్యాయులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన వారిలో విద్యాశాఖ జేడీ మధుసూదనబాబు, ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో చంద్రకళ, ఎంఈవో అనురాధ తదితరులున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగును గౌరవించుకోవడం అందరి బాధ్యత

- ఆచార్య వెలమల సిమ్మన్న
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ఆచార్య సిమ్మన్నను సత్కరిస్తున్న అధ్యాపకులు



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో..



శ్రీకృష్ణ దేవరాయలు, అష్టదిగ్గజ కవుల వేషధారణలో విద్యార్థులు



గిడుగు రామ్మూర్తి గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడు అప్పారావు

భీమునిపట్నం: మన మాతృభాష తెలుగును గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు విభాగ ఆచార్యులు వెలమల సిమ్మన్న అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యా విధానంలో ఆంగ్లభాషకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటోందని, అయినప్పటికీ మన మాతృభాషను మర్చిపోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో ఆచార్య సిమ్మన్నను ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ డి.ప్రవీణ, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

- మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి తెలుగు పదం నాగబు

తగరపువలస: తొలి తెలుగు పదం నాగబును గుంటూరు జిల్లాలోని అమరావతి స్థూపంపై వేటూరి ప్రభాకర శాస్త్రి కనుగొన్నారని ఒకటోవార్డు బంగ్లా మెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకొంటున్నట్టు తెలియజేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- భీమిలి కేథరిన్ విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.
- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.వి. సంతోష్ మాధవ్, బొత్స సీతంనాయుడు, విజయలక్ష్మి, సుధాంశ, సరళాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.
- చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. గిడుగు రామమూర్తి సవర భాషకు చేసిన సేవ గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వి.టి. రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు.

అలరించిన అష్టదిగ్గజాలు

పద్మనాభం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ కృష్ణ దేవరాయలు, అష్ట దిగ్గజ కవుల వేషధారణలో విద్యార్థినీ, విద్యార్థులు అలరించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

- మండలంలోని ఆర్‌వీపురం, పద్మనాభం, అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

వైశ్య విద్యార్థులకు ప్రోత్సాహకాలు



జాన్వికకు రూ.10వేల చెక్కు అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తగరపువలస: గుంటూరుకు చెందిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఫోరం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేల వంతున చెక్కులు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 219 మందిని ఎంపిక చేయగా తగరపువలసకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ ప్రోత్సాహకానికి అర్హత సాధించారు. అందులో భాగంగా పదో తరగతిలో 571 మార్కులు సాధించిన మద్దుల జాన్విక, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 455 మార్కులు సాధించిన ఆలవెల్లి యశ్వంత్‌కు స్థానిక ఆర్యవైశ్య, వాసవి సంఘాల ప్రతినిధులు గురువారం చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఆదిమూలం నాగరాజు, దుర్గా శేఖర్, చెరుకూరి దేముళ్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశ మందిరం లేక అవస్థలు



వైద్యాధికారి చాంబర్‌లో సమావేశానికి స్థలం చాలక బయట నిలబడిన కార్యదర్శులు



సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో స్థలం చాలక నిలబడిన సిబ్బంది

జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో పరిస్థితి

మధురవాడ: జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సమావేశ మందిరం లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొద్ది నెలలక్రితం రూ.50 లక్షలతో పునర్నిర్మాణం, మరమ్మతులు చేశారు. అయితే, సమావేశ మందిరం లేకపోవడంతో చిన్న మీటింగ్ నిర్వహించాలన్నా కల్యాణమండపాలు, కమ్యూనిటీ హాళ్లు వెదుక్కోవలసి వస్తోంది. జీవీఎంసీ జోన్–2 మధురవాడ కార్యాలయం పరిధిలో బోయిపాలెం నుంచి ఆరిలోవ, సింహాచలం, సాగర్‌నగర్ వరకు 5 నుంచి 13 వరకు 9 వార్డులు ఉన్నాయి. ఇందులో 92 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతీ సచివాలయానికి కనీసం ఏడెనిమిది మంది సెక్రటరీలు ఉన్నారు. సుమారు 900మంది వార్డు కార్యదర్శులు ఉన్నారు. లక్షన్నర వరకు జనాభా ఉన్న ప్రాంతం. కనీసం ఇక్కడ ముఖ్య అధికారులు, ఒక విభాగం కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలన్నా సంఖ్య వంద దాటిపోతుంది. ఆఫీసులో పెద్ద చాంబర్ జోనల్ కమిషనర్‌దే. అందులో కూడా పట్టుమని 30 మంది కూర్చునే పరిస్థితి లేదు. దీంతో సగం మంది కూర్చుని, మిగిలిన వారికి కుర్చీలు వేయడానికి స్థలం చాలక నిలబడి ఉండాల్సిన పరిస్థితి. ఇక టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ వంటి విభాగాల్లో సమావేశాలు పెట్టాలన్నా ఇదే పరిస్థితి. పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగాలైతే పట్టుమని పది మంది కూడా కూర్చునే అవకాశం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సారించి, సమావేశమందిరం నిర్మించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం

సమావేశ మందిరం లేక చిన్న మీటింగ్ పెట్టుకోవాలన్నా ఇబ్బంది ఉన్నమాట వాస్తవమే. సౌకర్యం కేంద్రంపై అదనపు ఫ్లోర్ నిర్మించి మీటింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం.

– శైలజావల్లి, జోనల్ కమిషనర్

తెరిపివ్వని వాన



కొత్త మూలకుద్దులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన వర్షంనీరు



బీచ్ రోడ్డులో నేలకొరిగిన చెట్లు

తగరపువలస: బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో భీమిలిలో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. వర్షాలకు పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. చెట్లు కూలడం, విద్యుత్ వైర్లు తెగిపడటంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కారణంగా కూరగాయలు, పూలతోటల్లో నీరు నిలిచి నష్టం కలిగిస్తోంది. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. శుక్రవారం కూడా వర్షం కొనసాగే అవకాశం ఉన్నందున దినసరి కార్మికులు, కొండవాలు ప్రాంతాల్లో నివసించే వారు, పూరిళ్లలో ఉండే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీరంలో భారీ వర్షం

కొమ్మాది: భీమిలి తీర ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి ఈదురు గాలులుతో పాటు భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఉప్పాడ, తిమ్మాపురం ప్రాంతాల్లో పలు చెట్లు నేలకొరిగాయి. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గురువారం కూడా వర్షం, ఈదురు గాలులు ప్రభావంతో తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. చేపల వేట నిలిపివేసి బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు చేరవేయడంతో నిమగ్నమయ్యారు. సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. వర్షాల కారణంగా పరదేశిపాలెం గెడ్డ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

నిలిచిన నీరు

పీఎం పాలెం: వాన తెరిపివ్వకపోవడంతో ఆర్‌హెచ్ కాలనీ, బాబా నగర్ , గాయత్రీ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీల్లోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. విద్యార్థులు, దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు.